





# శ్రామిక కోణం

[ 2 పెద్ద కథలూ,
కొన్ని వ్యాసాలూ, ఉత్తరాలూ,
పాఠకులతో పరిచయాలూ,
కలిసిన సంపుటం ]

## రంగనాయకమ్మ





# శ్రామిక కోణం

[ 2 పెద్ద కథలూ,
కొన్ని వ్యాసాలూ, ఉత్తరాలూ,
పాఠకులతో పరిచయాలూ,
కలిసిన సంపుటం ]

## రంగనాయకమ్మ

స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీ హిల్స్ పోస్టు
**హైదరాబాదు - 500 033**

**శ్రామిక కోణం**
[ 2 పెద్ద కథలూ,
కొన్ని వ్యాసాలూ, ఉత్తరాలూ,
పాఠకులతో పరిచయాలూ,
కలిసిన సంపుటం ]

పేజీలు : **288**
[ రాయల్ సైజులో,
హార్డు బౌండుతో ]

**ధర : 120 రూ.లు**

రచనా కాలాలు:
**రచనల దగ్గిరే చూడండి!**

కంపోజింగ్ & పేజ్ మేకప్:
**ఎన్.రఘురామయ్య**

పుస్తకంగా,
మొదటి ముద్రణ: 2012 సెప్టెంబరు

ముద్రణ:
**చరితా ఇంప్రెషన్స్**
1-19-1126/బి
ఆజామాబాదు ఇండస్ట్రియల్ ఏరియా
హైదరాబాదు - 500 020
(ఫోన్: 040-27678411)

బైండింగ్:
**వై.వి.రెడ్డి బైండింగ్ వర్క్స్**
మూసారాంబాగ్, హైదరాబాదు - 36
(ఫోన్: 040-65162429)

ప్రతులకు:
**అరుణా పబ్లిషింగ్ హౌస్**
ఏలూరు రోడ్డు
విజయవాడ - 520 002
(ఫోన్: 0866 - 2431181)

రంగనాయకమ్మ అడ్రసు:
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గర)
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# విషయ సూచిక


**1.** శోష! శోష! ( పెద్ద కథ )....... 4

**2.** ఇంటర్నెట్ పెళ్ళి చూపులు ( పెద్ద కథ )... 29

**3.** మేధో మథనం కాదు, మేధో పతనం! ................ 55

**4.** 'శ్రమ దోపిడీ'ని బైటపెట్టింది ఎవరు? ............... 85

**5.** నిందలు మోపి, సమన్వయం సాధించలేరు ...... 87

**6.** 'దిటవు గుండెలు' పుస్తకం గురించి .................. 96

**7.** ఉద్యమాలకు, క్రమశిక్షణ అవసరం లేదా? ...... 102

**8.** అసలు ఏమిటీ సంఘం!.................................. 110

**9.** బెయిల్ నించి జెయిల్‌కి!
( కేవీఆర్‌కీ, నాకూ మధ్య కొన్ని ఉత్తరాలు ) ............... 118

**10.** ఉద్యమం ఒకటే, నినాదాలు మూడు! .............. 123

**11.** పత్రికలకు రాసిన కొన్ని ఉత్తరాలు .................... 127

**12.** కావలసింది సమాధులు కావు, రచనలే! ........... 130

**13.** ఏ మహిళల కోసం ఈ దినోత్సవాలు? .............. 133

**14.** విగ్రహాలకూ శతృవులుంటారు!.......................... 136

**15.** అస్తవ్యస్త సంస్కర్తలు! .................................. 138

**16.** సమానత్వ శ్రమ విభజనతోనే కుల నిర్మూలన! . 142

**17.** 'చే'ని ఎలా అర్థం చేసుకోవాలి? ........................ 152

**18.** ప్రశ్నల తుట్టను కదిపిన సందర్భం! ................... 156

**19.** కొందరు పాఠకులతో, నా పరిచయాలు ............ 159

★నేను రచయిత్రినే కాదు, పాఠకురాలిని కూడా! ......... 280


★

# 1. శోష! శోష!

"ఆ హా! అయ్యో!" అని ఒక దాని వెంట ఒకటి, పొంతన లేని రెండు జంట కేకలు బైట పడ్డమూ; సుబ్బయ్య కవి, పేపరు వదిలేసి కుర్చీలో సొమ్మసిల్లి పోవడమూ; మొన్న లాగే, మొన్నటికి కిందటి మొన్న లాగే, పొద్దున్న మళ్ళీ జరిగాయి. అప్పుడప్పుడూ అది తప్పడం లేదు, ఆర్నెల్ల నించీ.

భార్యా, కొడుకూ, కూతురూ, ఎక్కడి వాళ్ళక్కడి నించి మధ్య గదిలో కొచ్చి పడ్డారు.

"అయ్యో, నాన్నకి మళ్ళీ శోష వచ్చినట్టుంది" అన్నాడు కొడుకు గాభరాగా.

కూతురు గబ గబా ఫాను మీట నొక్కింది గానీ అది కదల లేదు. కరెంటు లేదు.

"విసిని కర్ర తీసుకురామ్మా!" అన్నాడు కొడుకు కంగారుగా.

"విసిని కర్రేవిటీ? మతి పోయిందా? పదేళ్ళయింది విసిని కర్ర చూసి. ఆ మాటెందుకొచ్చింది ఇప్పుడు?" అంటూ కుర్చీ పక్కనే పడి వున్న పేపరు తీసి విసరడం మొదలు పెట్టింది సుబ్బయ్య భార్య. ఆ కొడుకు తల్లి.

కూతురు వెనక వసారా దాకా పరిగెత్తి తలుపులన్నీ బార్లాగా తెరిచింది గాలి కోసం.

"డాక్టరు గార్ని పిలవరాదూ?" అంది తల్లి, కొడుకుతో.

"ఏం పిలుస్తాం? పాపం ఆయన వస్తాడు గానీ, 'అంతా నార్మల్, జబ్బు లేదే!' అంటాడు. ఆయనకీ అక్కడ ఇద్దరో ముగ్గురో పేషెంట్లు వుంటారు. చూద్దాం, కాస్సేపటికి తెలివి రాకపోతే పిలుస్తాలే" అన్నాడు కొడుకు.

ఆ కొడుకు, అశ్రద్ధ కొడుకు కాదు. ప్రాణం పెడతాడు తండ్రికి. చిన్నప్పుడెప్పుడో తను రాతి మీద జారి బోర్లా పడితే, తండ్రి చప్పున ఎత్తుకుని, సముదాయించి, చాలా సేపు ఓదారుస్తూ తిరిగిన సంగతి ఇప్పటికీ జ్ఞాపకం వుందని చెప్పుకుంటూ వుంటాడా కొడుకు. కూతురూ అంతే; తండ్రి తనకి, చిన్నప్పుడు జడ గంటలు చేయించాడని ఎప్పుడూ మురిసి పోతూ చెప్పుకుంటూ వుంటుంది. ఆ పిల్లల తల్లికి అయితే, భర్త అంటే భయమే లేదు. భర్తకి అన్నం వడ్డించేటప్పుడు నిర్భయంగా తిరుగుతుంది. కూరల్లో ఉప్పెక్కువైనా తింటాడు, తక్కువైనా తింటాడు, అసలు లేకపోయినా తింటాడు. అందుకే ఆవిడికి భర్తంటే నిర్భయం!

అసలు సంగతి చెప్పాలి, వినాలి, సుబ్బయ్య గురించి. అదేదో చిన్న స్కూల్లో టీచరు పనిచేసి, ఐదేళ్ళ నించీ విశ్రాంత టీచరు అయ్యాడు. అది కాదు, అసలు సంగతి. "సుబ్బయ్య గారు మంచి కవి" అంటారు కొందరైనా. ఆ 'కొందరు' ఎక్కడున్నారో కనపడరు గానీ, వెతికితే దొరక్కపోరు ఎక్కడో అక్కడ. ఒక చోట ఒక రకం మనిషి వున్నాడంటే, అలాంటి రకం మనుషులు తప్పకుండా ఇంకెక్కడెక్కడో వుండే వుంటారు. లేకపోతే, ఒక్క మనిషే, ఒక రకం అవడు.

సుబ్బయ్య చిన్నప్పుడే చంద్రకాంతం పువ్వుల మీద ఒక పద్యం రాశాడు. ఆ పూల రంగు, పసుపూ కాదు, ఎరుపూ కాదు; నలుపూ కాదు, తెలుపూ కాదు. భలే భలే రంగుల్లే అని రాశాడు. అంతే కాదు, బంతుల మీదా, చామంతుల మీదా, బొగడ బంతుల మీదా కూడా ఎన్నెన్నో రాశాడు.

వెన్నెల మీద రాశాడు - ఎంత తెలుపో, ఎంత నలుపు కాదో అని!

పన్నెండు సంవత్సరాలకి ఒకసారి సముద్రాల్లో మునిగే అదేదో పండగ వస్తుందే, దాని మీదా రాశాడు - అమ్మో, ఎంత నీరో, ఎంత ఉప్పో - అని!

కొంచెం ఎదుగుతూ - ఎదుగుతూ, కోయిళ్ళ మీదా, తుమ్మెదల మీదా, పావు రాళ్ళ మీదా, ప్రియురాళ్ళ చెక్కిళ్ళ మీదా, డజన్ల డజన్ల పద్యాలు రాశాడు. పద్యాలే కాదు; వచన కవిత్వాలంటారే, అవి కూడా తేలిగ్గా రాసేశాడు. ఏం లేదు, వచనాల్ని ముక్కలు చేసి, ఒక దాని కింద ఒకటి పెట్టేశాడు. ఆ పద్ధతి కనిపెట్టాక, పద్యాలు వదిలేసి, వచనాలే పట్టుకున్నాడు. వచనాలు తోచనప్పుడు పద్యాలూ రాస్తాడు.

ఒక సారెప్పుడో, చుట్టం బావని కొండల వేపు షికారు తిప్పుతూ, అక్కడ నాలుగు గుడిసెలు కనపడి, గుడిసెల ముందు గుడ్డలు లేని పిల్లలు తిరుగుతూ కనపడి, ''ఆహా! ప్రకృతిలో కలిసి పోయి జీవించే శిశువుల్లారా! బాలల్లారా! ఎంత స్వేచ్ఛరా మీకు! ఎంత హాయిరా మీకు! వెన్నెలంతా మీదే కదరా! ఆహా!'' అని పది పద్యాల దాకా రాశాడు.

మళ్ళీ ఆ కొండల వేపు తిరిగే సందర్భం రాక, ఆ గుడిసెలు గుర్తు లేక, పెళ్ళాం ఒక పూట తల నిండా బంతి పూలు పెట్టుకుంటే, అది కనపడి, ''పసుపు ముద్దలు! ముద్ద బంతులు! పూలు ధరించే ఇంతులు, కాంతలు, పూబంతులు'' అని గబ గబా రాసేశాడు.

ఇదీ అదీ అని కాదు; 16రో ఏట నించీ, దాన్ని తిరగేస్తే వచ్చే ఇప్పటి 61టో ఏట దాకా; ఆ పద్యాలో, వచనాలో, పద్య వచనాలో, వచన పద్యాలో, మొత్తానికి రాసిన దాన్నల్లా 'కవిత్వాలు' అని చెప్పుకుంటారే, అలాంటివి రాస్తూనే వున్నాడు. వాటిల్లో గుప్పెడైనా మారు మూల పత్రికల్లో పడకపోలేదు. చారెడైనా షష్ఠి పూర్తి సభల్లో చదవకపోలేదు.

పదేళ్ళ కిందట, అప్పటికి కూడిన తన రచనలన్నీ కలేపి ''చంద్రకాంత శతకం'' పేరుతో ఒక పుస్తకం కూడా వేయించుకున్నాడు. ఆ శతకంలో అన్ని రకాలూ నూట నలభై దాకా చేరాయి. ఆ శతకానికి రాబోయే కుప్ప తెప్పల లాభాలతో, రాయబోయే వచనాల్ని ఇంకో అర డజను కవితా సంపుటాలైనా, వేయించగల ననుకున్నాడు. అచ్చయిన శతకంలో సగం కాపీలైనా ఎందరికో తన సంతకాలతో పంచి పెట్టాడు. ''బాగా రాస్తారండీ మీరు'' అన్నది, ఆ పుస్తకాలు కొనకుండా అందుకున్న వాళ్ళే.

ఆ శతక కవిత్వాల రెండు పెద్ద కట్టలు ఇంట్లోనే ఒక మూల దాచి, ఒక పుస్తకాల షాపులో డజన్ కాపీలు పెట్టి, ఆర్నెల్ల దాకా చూస్తే, వాటిల్లో రెండు కదిలాయి. ఆ రెండులో ఒకటైతే, మళ్ళీ వెనక్కి వచ్చేసింది. దాన్ని కొన్న వాడు, దాన్ని వెనక్కి తెచ్చి, ''ఇది వొద్దులెండి'' అని, దానికి బదులు ఒక ఎక్కాల పుస్తకం తీసు కెళ్ళాడు.

షాపు మనిషి తెలివైన వాడు. ఆయనకి, ఆ ఆర్నెల్లకి ఒక ఆలోచన తట్టింది. ''సుబ్బయ్య గారూ! ఇక్కడ వ్రతాల పుస్తకాలూ, జ్యోతిష్యం పుస్తకాలూ కొనే వాళ్ళందరికీ, మీ చంద్రకాంతం శతకాన్ని ఒక్కో కాపీ ఉచితంగా, బహుమతిగా, ఇచ్చేస్తానండీ! ఏమంటారు?'' అని అడిగాడు.

సుబ్బయ్య ఏమీ అనలేదు. ఏమంటాడు? సంతోషించాడు. ''చిన్నప్పుడు మా బళ్ళో, నేను పద్యాలు బాగా రాశానని ఠాగూర్ కథల పుస్తకం ఒకటి నాకు బహుమతిగా ఇచ్చారు. బహుమతుల్ని చక్కగా దాచుకుంటారు ఎవ్వరైనా. ఠాగూర్ పుస్తకం బాగా దాచి వుంచుకున్నాను. ఇంకా చదవలేదు. చదవాలి ఎప్పుడో! కవిత్వాల్లో వున్న సొగసు, కథల్లో వుండదండీ! కానీ, బహుమతుల పుస్తకాల్ని దాచుకుంటారు గానీ చదవరేమో! సరే, అలాగే. నా చంద్రకాంతాల్లో, నా సంతకాలు పెడతాను'' అని ఆ పదకొండు పుస్తకాలూ ముందేసుకుని, అన్నిటి మీదా ఆనందంగా సంతకాలు తీర్చి తీర్చి చేసి ఇంటికొచ్చాడు.

రెండో సంకలనం తీసుకు రాలేదు గానీ, కవితలు అల్లడం అయితే మానలేదు, ఆపలేదు. రిటైరయ్యాక అవి మరీ ఎక్కువయ్యాయి. నెలకో దస్తా తెల్ల కాయితాలు కొడుకు తెస్తూనే వుంటాడు. కొడుకు, కాస్త క్లర్కు ఉద్యోగంలో కుదురు గానే వుంటున్నాడు.

అంతా ప్రశాంతంగా సాగిపోతోన్న గృహంలో, సుబ్బయ్యకి అప్పుడప్పుడూ శోషలు వచ్చి పోతున్నాయి. అప్పుడప్పుడూ అంటే ఎప్పుడెప్పుడంటే, పత్రికలు తిరగేసినప్పుడే ఎక్కువ సార్లు. ఆయన రేడియో కూడా శ్రద్ధగా వింటాడు; టీవీని మానకుండా చూస్తాడు. అసలు కాలక్షేపమే అది.

భార్య, ఉప్మాలూ, కాఫీలూ, పుల్లట్లూ, పెసరట్లూ, మినపట్లూ. బొబ్బట్లూ, అందిస్తూ వుంటుంది పూట పూటా మార్చి మార్చి. ఆవిడ, విశ్రాంత గృహిణి అవలేదింకా. ఆవిడితో పక్కింటి వాళ్ళు, ''మీకు ఖాళీ దొరకాలంటే, కోడలు రావాలి గానీ, ఈ కాలం కోడళ్ళని నమ్మలేం'' అంటూ వుంటారు. వాళ్ళు, ఇద్దరేసి కోడళ్ళున్న పక్కింటి వాళ్ళు.

సుబ్బయ్య కవి, భార్య అందించేవి తింటూ, తాగుతూ, వింటూ, చూస్తూ, రాస్తూ, నిద్రిస్తూ, లేస్తూ, తింటూ, వింటూ, రాస్తూ, చూస్తూ, అరవై ఒకటో ఏడాది అంచుకి చేరాడు. ఇంకో పది - పది హేనేళ్ళు, పోనీ

ఇంకో పదహారేళ్ళు తింటూ, తాగుతూ, రాస్తూ, గడిపేస్తే పోయేది.

ఏవిటో మరి శోషలు మొదలయ్యాయి! వాటి కన్నా ముందు రెండేసి కేకలూ! మొదటిది విభ్రాంతీ, రెండోది విషాదం! ఎప్పుడూ అలాగే! వాటికి పొంతనే వుండదు. సుబ్బయ్యకి వైద్యం చేస్తోన్న నలభయ్యేళ్ళ డాక్టరు రంగారావు, పాపం చాలా మంచివాడు. ఆయన్ని అసలు డాక్టర్‌గా ఎవరూ చూడరు, రంగారావు గానే చూస్తారు. రంగారావు మంచి మనిషని అందరికీ తెలుసు గానీ, మంచి డాక్టరని తెలిసిన వాళ్ళూ, ఒప్పు కునే వాళ్ళూ, కొంత తక్కువే. అయినా మంచి మనిషి చుట్టూ చేరినట్టే చేరతారు ఆయన ఆస్పత్రికి. చాలా మంది ఆయన్ని, 'డాక్టరు గారూ' అనరు, 'రంగారావు గారూ' అంటారు.

ఈ డాక్టరు, డాక్టరు పోజులు కొట్టడు. ఎక్కువ మందులు రాయడు. ఎక్కువ ఇంజక్షన్లు పొడవడు. ఎక్కువ ఆపరేషన్లు కొయ్యడు. చివరికి ఎక్కువ ఫీజులు లాగడు. ఏ జబ్బు మనిషి వెళ్ళినా, నాడి చూసి, కళ్ళు చూసి, "ఏం లేదు నీకు. పండులా వున్నావు. వ్యాయామం చేసుకో! పిల్లలతో పరుగులెత్తే ఆటలు ఆడుకో! శుభ్రమైన ఆకు కూరలతో అన్నం తిను!" అంటాడు.

దగ్గుకుంటూ వచ్చే పేషెంటుకి, వీపు మీదా - పొట్ట మీదా - గుండె మీదా - తన చెవుల గొట్టంతో పరీక్షలు చేసి, "ఏం లేదు నీకు, ముత్యంలా వున్నావు. ఇదో జబ్బా పాడా? ఇంటికి పోయి వేడి నీళ్ళు తాగు, ఆవిరి పట్టు!" అంటాడు.

"ఏదన్నా ఇంగిలీసు మందివ్వండి రంగారావు గారూ!" అని దీనంగా అడుగుతాడు దగ్గుల పుల్లయ్య.

డాక్టరు నవ్వుతాడు. "మందే చెప్పాను నీకు. నేను చెప్పింది మందే" అంటే, పుల్లయ్య ఒప్పుకోడు. "ఇంజీ షనే చెయ్యండి" అంటాడు. లేకపోతే, "రాత్రి నిద్రే లేదయ్యా! నిద్ర మాత్రియ్యి!" అంటాడు.

"నిద్ర మాత్రలు అసలే వాడకూడదు పుల్లయ్యా! కిడ్నీలు పాడవుతాయి" అని డాక్టరు అన్నప్పుడు,

"కిడ్నీలు నాకూ వుంటయ్యా?" అన్నాడు పుల్లయ్య.

నవ్వుల్లేకుండా నోరు విప్పలేని డాక్టరు, అలాంటి ప్రశ్నలకి నవ్వడు. "ఒక మనిషికి వున్నవన్నీ, మనుషు లందరికీ వుంటాయి. ముక్కులూ చెవులూ అందరికీ ఒక్క లాగే వున్నాయా లేవా?" అని బోధించి, ఇంకా చెప్పుకుంటూ వెళ్ళాడు. "ఇంగ్లీషు మందు - ఇంగ్లీషు మందు, అనకు. నేను ఇంగ్లీషు డాక్టర్నేగా? దగ్గు, ఇంగ్లీషుదైనా, తెలుగుదైనా, ఒకటే. శరీరంలో అప్పు డప్పుడూ ఏదో కాస్త వికటిస్తుంది నాలుగు రోజులు. దాన్ని పట్టించుకోకుండా, అటు చూడకుండా వదిలేస్తే, అదే పోతుంది. దగ్గులూ, గిగ్గులూ, వస్తే రానీ! లెక్క చెయ్యొద్దు! రాత్రి నిద్ర పోకపోతే కొంప మునుగు తుందా? పగలు నిద్రపో!" - ఆ రకంగా బోధన పుల్లయ్యకి!

"పగలు నేను పనికి పోవద్దయ్యా?"

"పని చేసుకొచ్చాక హాయిగా స్నానం చేసి, తిండి తిని, నిద్రపో! ఎంత నిద్ర పడుతుందో చూడు!"

"కాదయ్యా! ఒక్క మాత్ర రాయి!" అంటాడు పుల్లయ్య వదలకుండా.

డాక్టరు, రెండు పిప్పర్‌మెంటు బిళ్ళలు అతని చేతిలో పెట్టి, మల్టీ విటమిన్ మాత్రల చీటీ రాసి, "వేడి నీళ్ళు తాగడం మర్చిపోకు సుమా!" అని మళ్ళీ హెచ్చరికలు చేశాడు.

పుల్లయ్య, అలాగే ప్రతీ సారీ పిప్పరమెంట్లు నోట్లో పడేసుకుని, 2 రూపాయలు బల్ల మీద పెట్టి, దండం పెట్టి, నవ్వుతూ వెళ్తాడు.

డాక్టరు, అంత నవ్వుతూ, అంత ముద్దుగా, రోగితో మాట్లాడితే, ఆ మాటలకే సగం జబ్బు పోవాలి. ఎల్లయ్య లాంటి వాళ్ళకి అలా జరుగుతుంది గానీ, మల్లయ్యకి అలా జరగదు. "ఎక్కడో నెప్పయ్యా! తెలవటం లేదూ" అంటూ వస్తాడు మల్లయ్య. రాగానే, "ఇండీసనియ్యి రంగారావు సారూ!" అంటాడు.

డాక్టరు నవ్వుతాడు. ఈయన, పెళ్ళాం దగ్గిర రోజుకెన్ని సార్లు నవ్వుతాడో గానీ, పేషెంట్ల దగ్గిర మాత్రం వాళ్ళ మాటలు విని, చీటికీ మాటికీ నవ్వుతూ, దయగా, పిల్లలతో ఆటలాడినట్టు ఆడతాడు.

మల్లయ్య అయితే, ఆ నవ్వులకు లొంగడు. ఇండీషన్ వేయించుకోకుండా కదలడు. డాక్టరు ఏం ఇండీషనిచ్చాడో తెలవక్కర్లేదు. ఇంటికి పోగానే, పక్క వాళ్ళతో, "సూది పోటు ఏయించుకొచ్చా" అని చెప్ప

కుంటాడు రెం(డ్రోజుల దాకా.

గోపయ్య తోటీ, శివయ్య తోటీ అయితే, డాక్టరుకి మరీ ఇబ్బంది. వాళ్ళు వచ్చారంటే, గడప బైటే నిలబడి, ''సారూ, గులుకోజు సీసా ఎక్కిస్తావా?'' అని బేరం పెడతారు.

డాక్టరుకి కోపమే రాదు, ఏ బళ్ళో చదివాడో గానీ! రష్యాలో చదివానని చెప్పుకుంటాడు, రష్యాలో అంత సొగసు ఏడిసిందా? ఆ సొగసు రంగారావుదే. నవ్వడమే వైద్యం చెయ్యడం అనుకుంటాడు. నవ్వు మొహంతో, ''లోపలికి రా ముందూ. నీ జబ్బేమిటో చెప్పూ!'' అంటాడు దీర్ఘాలూ తీస్తూ.

''వస్తాలే సారూ! సీసా ఎక్కిస్తావా?''

''ఏం సీసా?''

''అదే, అదేదో సీసా. మా పక్క గుడిసి యాదయ్య ఎక్కించుకొచ్చాడు. రాయి లాగ తిరుగుతున్నాడు.''

''నిన్ను రాయి లాగ చెయ్యాలా? అసలు నీ జబ్బేంటీ?''

''నాకేం తెల్సు సారూ?''

''నీకు తెల్వదు కదా? మరి ఏం మందు ఇవ్వాలో నువ్వే ఎందుకు చెపుతున్నావు? డాక్టర్వి నువ్వా, నేనా?''

''నువ్వేలే సారూ. నువ్వే! నేను డాట్టరైతే, నేను నీ కాడ కొస్తానా? నువ్వే నా కాడకొస్తావు.''

డాక్టరు బాగా నవ్వుతాడు. ''కదా? పేషెంటే డాక్టర్ దగ్గిరికి రావాలి. నువ్వే నా దగ్గిరికి రావాలి కదా? రా లోపలికి!''

డాక్టరు మీద జాలితోనో, మొహమాటం తోనో, అప్పుడు లోపలి కొస్తాడా పేషెంటు. కాసేపటికి సంతోషం గానే వెళ్తాడు బైటికి. వెళ్ళాక, పక్క వాళ్ళతో, ''రంగారావు మంచివాడే గానీ, అంత తెల్వదబ్బా ఆయన్కి'' అంటాడు.

అలాంటి మాటలు పుల్లయ్య అయితే ఒప్పుకోడు. ''అదేం మాట? ఆయనకి అన్నీ తెల్సు. కిడ్నీలు నాకూ వుంటయ్యని చెప్పాడు. మొన్న మందు లేకుండా నా దగ్గు తగ్గించాడు'' అని వాదిస్తాడు.

''నిజవేలే, నా నెప్పులూ తగ్గించాడు.''

గుడిసెల్లో కాకుండా, కాస్త సిమ్మెంటు డాబాల్లో బతికే వాళ్ళయితే, ''రంగారావు డాక్టర్కి వైద్యశాస్త్రం మీద కన్నా, ఇంకేదో శాస్త్రం మీద ఎక్కువ నమ్మకం'' అంటారు. అయినా రాకుండా మానరు. ఆ ఇంకేదో శాస్త్రం కోసమే వస్తారు.

సుందరమ్మ అయితే, చాలా కాలం తం(డిని తీసుకుని వచ్చేది గానీ, తం(డి పోయాక, ఆవిడ తన కోసమే వస్తూ వుంటుంది. వచ్చాకే ఏదో ఒక జబ్బుని ఊహించి చెప్పుకుంటుంది. ''నడుం నొప్పి అను కుంటానండీ. ఒక్కోసారి వుంటుంది, ఒక్కోసారి వుండదు'' అంటుంది.

డాక్టరు నవ్వుతాడు. ''మా మెడికల్ చదువులో, మొట్ట మొదటి రోజు ఒక లెక్చెరరు గారు ఏం చెప్పారో తెలుసాండీ? నూటికి 99 జబ్బులకి, అసలు మందులే అక్కర్లేదు. వైద్యం లేకపోయినా అవే పోతూ వుంటాయి. మిగతా ఆ ఒక్క జబ్బు, వైద్యం వున్నా తగ్గదు. అంటే, మొత్తం 100 జబ్బులకీ అసలు డాక్టర్లే అక్కర్లేదు, దండగ' అని చెప్పారు. మేం ఒకటే నవ్వులు!'' అంటూ, ఆ నవ్వులన్నీ ఇప్పుడు కూడా నవ్వుతూ చెప్పాడు డాక్టరు.

''మిగతా స్టూడెంట్స్ కన్నా మీరు మరీ నవ్వి వుంటారు. అది సరేనండీ, నా నడుం నొప్పి, 99 జబ్బుల్లోకి వొస్తుందా, ఆ ఒక్క జబ్బుల్లోకి వస్తుందా?'' అంటుంది సుందరమ్మ.

''ఆ ఒక్క జబ్బులోకే వస్తుంది. అది తగ్గేదా, పెట్టేదా? నడుం వేపు చూడకండి! దాంతో మీకేం పని?'' అంటాడు డాక్టరు.

''అదేంటండీ డాక్టరు గారూ? నడుం వేపు చూడొద్దా? ఏదన్నా మందు చెప్పరాదాండీ?''

''మందు ఎందుగ్గానీ, డాన్సు నేర్చుకోండి! నడుం హాయిగా గంతులేస్తుంది.''

''అవ్వ! ఇప్పుడు డాన్స్ నేర్చుకోనా!''

''ఏం? అదే వైద్యం మరి! మందు అడిగారుగా? మందే చెప్పాను. వ్యాయామాన్ని, ఏదైనా 'పని' తోనో, 'కళ' తోనో కలిపి చెయ్యాలి. విడిగా చెయ్యమంటే బద్ధకాలు!''

''డాక్టరు గారూ! మీరు రోజూ వ్యాయామం చేస్తారాండీ!''

''నన్ను వ్యాయామం చెయ్యమని డాక్టరు చెప్ప లేదు నాకు. చెప్తే ఎందుకు చెయ్యనూ?''

సుందరమ్మ బాగా నవ్వుతుంది. "మీ మాటలే నాకు వైద్యం! నా నడుం నెప్పి పోయిందిలెండి!" అంటూ నవ్వుకుంటూ వెళ్ళి పోతుంది.

రంగారావు డాక్టర్‌కి పిచ్చో యేమో గానీ, ఏ పేషెంటన్నా కారు మీద వస్తే, నవ్వులు కట్టి పెట్టేస్తాడు. మొహానికి ముభావం పులుముకుంటాడు. అందుకే నేమో, కార్ల పేషెంట్లు అక్కడికి ఎక్కువగా రారు.

రంగారావుది మరీ తీరిక లేని ప్రాక్టీసు కాదు. అవసరమైతే, కొందరు పేషెంట్లని కాంపౌండరు అప్పా రావే చూసి పంపగలడు. మరీ అవసరమైనప్పుడే అది. పేషెంట్లకి, డాక్టరు ఎంత ఇష్టమో, అప్పారావు కూడా అంత ఇష్టమే. కొందరైతే, అప్పారావునే "డాక్టరు గారూ!" అంటారు, డాక్టరు ముందే. డాక్టరు నవ్వు తాడు.

రంగారావుకి వుండే తక్కువ ప్రాక్టీసులోనే, సుబ్బయ్యల్లాంటి కవులూ, మంగయ్య ల్లాంటి రచ యితలూ, కనకయ్యల్లాంటి కళాకారులూ కొందరు, తారసపడుతూ వుంటారు.

సుబ్బయ్య కవి, ఆర్నెల్ల నించీ రంగారావు డాక్టర్ గారి పేషెంటే. ఆ పేషెంట్‌కి పేపర్లు చూస్తే శోష లెందుకు వస్తున్నాయో అని, డాక్టరు, ఆ పేపర్లన్నీ ఓపిగ్గా తిరగేశాడు చాలాసార్లు. అన్ని పేజీలూ చూశాడు. ముఖ్యమంత్రిని వుంచాలా - తీసెయ్యాలా వార్తలూ, తెలంగాణా ఇవ్వాలా - అక్కర్లేదా వ్యాసాలూ, పోలీసు ఎన్‌కౌంటర్లు నిజాలా - అబద్దాలా చర్చలూ, బిజినెస్ పేజీల్లో ఏ కంపెనీకి ఎన్నెన్ని కోట్ల నికర లాభాలో లెక్కలూ! సినిమా పోస్టర్లూ, స్పోర్ట్స్ వార్తలూ! అన్నీ పోగా, మిగతావన్నీ అడ్వర్టయిజ్‌మెంట్లే! వీటిలో దేన్ని చూస్తే సుబ్బయ్యకి విచారం కలుగుతోంది?

అది ఆయన్నే అడిగాడు డాక్టరు.

"తెలంగాణా విడిపోడం లేదే అని మీకు విచారం కలుగుతోందా సుబ్బయ్య గారూ?"

"అబ్బే! అది హైదరాబాదుని వదిలేసి విడిపోతే విడిపోవాలి. అలా విడిపోమనండి! ఆ గోల నా కెందుకు?"

"పోలీసులు అబద్ధపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని బాధ పడుతున్నారా?"

"పోలీసులు ఎప్పుడూ అలా చెయ్యరు. వాళ్ళ డ్యూటీలే వాళ్ళు చేస్తారు. శాంతిని కాపాడతారు వాళ్ళు. వాళ్ళేం చేసినా చట్టాల ప్రకారమే చేస్తారు!"

"జగన్‌ని తొందరగా జైల్లో పెట్టడం లేదనా? ఏ ఊరు జైల్లో పెట్టాలంటారు?"

"అయ్యో! అది చాలా తప్పు! ఎవ్వరైనా డబ్బు బాగా సంపాదించుకోవాలనే చూస్తారు. అతను చాలా చురుకైన, తెలివైన కుర్రాడు."

"అతని తండ్రి పోయాడని విచారమా మీకు?"

"ఏం చేస్తాం? ఆయన విధి అలా వుంది. విధిని ఎవరు తప్పించగలరు?"

"తండ్రి బాగా తాగి, ఆడ శిశువుని చంపేసిన వార్త ఒకటి వుందండీ ఇవ్వాళ పేపర్లో. అది చదివితే మీకు బాధేసిందా?"

"అలాంటి వార్తలు నేనసలు చదవను గానీ, సంసారాల్ని పోషించే మొగాళ్ళకి విసుగేస్తుంది మరి!"

"పోనీ ఇంకో వార్త కూడా వుంది. అసెంబ్లీలో, ఎమ్మెల్యేలు కుర్చీలు విసురుకుని పోట్లాడుకున్నారు. 'ఇదేం ప్రజాస్వామ్యం' అనిపించిందా మీకు?"

"అసలు, 'ప్రజాస్వామ్యం' అంటే, అది ఇలాగే ఏడుస్తుంది. డిక్టేటర్ రావాలయ్యా! రాజులే వుంటే, ఆ అందం వేరూ! తప్పులు చేసే ప్రతి వాళ్ళనీ ఉరి తీసి పారెయ్యాలి! రాజులే అలా చెయ్యగలరు."

"అలాగైతే, ఏదో ఒక వంక పెట్టి, మనల్నీ ఉరి తీసేస్తారుగా?"

"అబ్బే! మనల్నెందుకు తీస్తారు? నేను రాజు మీద పద్యాలు రాయగలను. మీరు రాజుకి వైద్యం చెయ్య గలరు. మనకేమీ జరగదు."

"ఈ వార్త చూడండి! ఒక స్త్రీ ఎవరో, ఆత్మహత్య చేసుకుంది. ఇది చదివారా? ఇదే మీకు బాధ కలిగించి వుంటుంది."

"అలాంటివి నేనసలు ముట్టుకోను. ఉంటారు పెంకి ఘడవలు. మొగుణ్ణి బెదిరించాలని ఏదో చేసి వుంటుంది."

డాక్టరు, చేతిలో పేపరు పక్కన పడేసి, సుబ్బయ్య చెయ్యి అందుకుని నాడి చూశాడు.

"బ్రహ్మాండంగా వున్నారు. కొంచెం రెస్టు అవసరం మీకు. హాయిగా నిద్రపోండి! పేపర్లు చదవకండి!"

"థర్మా మీటర్‌తో చూడరా వేడి?"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1306**

* * *

**Read other books of Ranganayakamma @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Ranganayakamma&id=181**